## పది క్షణాల్లో ఏం తెలుస్తుంది?

**సోషల్** మీడియాలో కనిపించే 10 సెకండ్ల రీల్స్ చూసి ఒకరి వ్యక్తిత్వాన్ని అంచనా వేయొద్దనీ, ఆ పది సెకండ్లలో ఒక వ్యక్తి గురించి ఏమీ అర్థం చేసుకోలేమనీ అంటున్నది ఖుషీ కపూర్. తన తాజా చిత్రం 'లవ్ యాపా' ప్రమోషన్‌లో భాగంగా.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నది ఖుషీ. ఇన్‌స్టా రీల్స్, ఏఐ, కుటుంబ బంధాలు.. ఇలా వివిధ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నది. కొంతమంది 10 సెకండ్ల రీల్స్ చూసి ఎదుటివారి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తున్నారనీ, ఆ పది క్షణాల్లో ఒక వ్యక్తి గురించి ఏం అర్థం చేసుకుంటారనీ ప్రశ్నించింది. 'రీల్స్‌లో కనిపించే వారి నిజ జీవితం గురించి ఏం తెలుసు? కనీసం వాళ్లు ఏం చేస్తారనే ఆలోచన కూడా ఉండదు. అలాంటప్పుడు.. వారి గురించి ఓ అభిప్రాయానికి ఎలా వస్తారు? అవతలి వారు ఎలాంటివారైనా.. ఒకరినొకరు గౌరవించుకోవాలి. రీల్స్ చూసి మనుషులను అంచనా వేయకండి. నెగెటివ్ కామెంట్స్ చేయకండి. లేదంటే.. మంచివారిని బాధపెట్టిన వాళ్లమవుతాం!' అని చెప్పుకొచ్చింది. ఇక సాంకేతికత అభివృద్ధిపై అభిప్రాయాలు పంచుకుంటూ.. ఏఐతో ఇంటర్నెట్‌లో భయంకరమైన విషయాలు చూస్తున్నామనీ, దీని గురించి అందరూ అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలని సలహాలు ఇచ్చింది. 'నిజజీవితంలో కమ్యూనికేషన్ అనేది ఎంతో ముఖ్యం. మన జీవితంలో ఎదురయ్యే కొన్ని విషయాల గురించి కుటుంబసభ్యులు, స్నేహితులతో తప్పకుండా చర్చించాలి. అప్పుడే బంధాలు బలపడతాయి' అంటూ బంధాల గొప్పదనాన్ని వెల్లడించింది. అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా తెరంగేట్రం చేసింది ఖుషీ. మొదటి సినిమా 'ది ఆర్చీస్'తోనే.. తానేంటో నిరూపించుకున్నది. ఆ తర్వాత 'లవ్ టుడే' రీమేక్‌తో బీటౌన్‌ను మెప్పించింది. తక్కువ సినిమాలే చేసినా.. మంచి పాపులారిటీని సంపాదించుకున్న ఖుషీకి సోషల్ మీడియాలో లక్షల్లో ఫాలోవర్లు ఉన్నారు.

# వెండితెర పెళ్లి పుస్తకం

**సినీ పరిభాషలో పెళ్లంటే... మూడే ముళ్లు.. ఏడే అడుగులు.. మొత్తం కలిపి నూరేళ్లు! ప్రేమకథలే కాదు.. పెళ్లి ముచ్చట్లు కూడా సినీ పండితులకు కథావస్తువే! ఆలుమగల అన్యోన్యతకు కొన్ని సినిమాలు పట్టం కడితే.. పెళ్లి గొప్పదనాన్ని మరికొన్ని చిత్రాలు రుజువు చేశాయి.. భర్తంటే భరించేవాడు కాదని, భార్యంటే బానిస కాదని నిరూపించినవీ ఉన్నాయి. ఏం చెప్పినా, ఎలా చూపించినా.. వెండితెర పెళ్లి కథలన్నీ శుభం కార్డుతో ముగిసినవే! వివాహ బంధం పవిత్రతను చాటిచెప్పినవే!!**

**నేడు ప్రపంచ వివాహ దినోత్సవం**

ఐదు రోజుల పెళ్లి.. అమ్మంటి పెళ్లి... తొలి చూపులే లేని.. తెలుగింటి పెళ్లి.. 'వరుడు' సినిమా కోసం వేటూరి రాసిన ఐదు రోజుల పెళ్లి పాట ఇది.
ఈ పాట వింటే.. వివాహ మహోత్సవం ఇంత రంజుగా ఉంటుందా అనిపిస్తుంది. పెళ్లి తంతు వివాహ భోజనంబు కన్నా వింతైనదనిపిస్తుంది.
పాట గొప్పదనం అటుంచితే.. 'వరుడు' పెళ్లీడుకొచ్చిన వాళ్లందరికీ ఆదర్శం అనిపిస్తాడు. కలెక్షన్ల పరంగా సినిమా అంతగా ఆడకున్నా.. 'వరుడు' ఇచ్చిన సందేశం ఏ తరం వాళ్లయినా మెచ్చే విధంగానే ఉంటుంది.
మూడు ముళ్లు పడకుండానే, ఏడు అడుగులు వేయకుండానే.. భర్త బాధ్యత ఏమిటో చాటి చెప్పిన సినిమా 'వరుడు'. తెర చేలం వెనుక తనను ఆత్రంగా వెదికిన అమ్మాయి చూపులు.. తన కళ్లతో కలవగానే 'నాతి చరామి' అనుకుంటాడా హీరో! తనకు కాబోయిన భార్యను ఎవరో ఎత్తుకెళ్తే.. సాహసించి తన ఇల్లాలిని కాపాడుకుంటాడు.
కథాపరంగా 'వరుడు' ఇంతే కావొచ్చు. కథనం పరంగా కాస్త గడబిడగా అనిపించొచ్చు. ఆ సినిమా మాత్రం ఓ ఉపదేశం. తనను నమ్మి వచ్చిన వధువు పట్ల వరుడు ఎంత బాధ్యతగా ఉండాలో చెబుతుంది. గుణశేఖర్ దర్శకత్వంలో అల్లు అర్జున్, భానుశ్రీ మెహ్రా జంటగా నటించిన 'వరుడు' విలువలు నేర్పుతుంది.

### అమ్ముకుట్టి.. కిట్టమూర్తి

పెళ్లయిన కొత్తలో.. అన్నీ వింతగానే ఉంటాయి. విసురుగా కసిరినా చొరవగానే అనిపిస్తుంది. కానీ, కాలం గడిచేకొద్దీ ఇద్దరి మధ్యా సఖ్యతను చెరిపే ప్రతికూలతలు ఎదురుపడతాయి. ఎవరో ఒకరు తగ్గకుంటే.. సంసారాన్ని నెగ్గుకురావడం కష్టం. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు పారిపోవద్దు. 'పెళ్లి పుస్తకం'లో ఆరుద్ర వారు సెలవిచ్చినట్టు.. 'అడుగడుగున తొలి పలుకులు గుర్తుచేసు'కుంటే సరిపోతుంది. అప్పుడు 'త్వరపడినా.. పొరబడినా.. తప్పు దిద్దుకో'వచ్చు. 'పెళ్లి పుస్తకం' చెప్పిందీ ఇదే! ఒకే చోట పని చేసే భార్యాభర్తలు. ఆలుమగలం అని చెప్పుకోలేని పరిస్థితి. ఎవరి బాధ్యతలు వాళ్లవి. అయినా ఒకరంటే ఒకరికి వల్లమాలిన ప్రేమ. ఇలాంటి పరిస్థితుల్లో పడ్డ నాయికానాయకులు ఓ దశ వరకూ బాగానే నెట్టుకొస్తారు! చూస్తుండగానే పరిస్థితులు చేజారిపోతాయి. దిద్దుకోలేనంత పెద్ద తప్పుగా పరిణమిస్తున్న తరుణంలో.. ఒకరినొకరు తెలుసుకొని ఒడుదొడుకులు తట్టుకుంటారు. అమ్ముకుట్టి అంతరంగం గ్రహిస్తాడు కిట్టమూర్తి. కిట్టమూర్తి మనసు తెలుసుకుంటుంది అమ్ముకుట్టి. కథ సుఖాంతం. ప్రేక్షకులకు వినోదంతోపాటు సంసార సూత్రమూ అందుతుంది. ముళ్లపూడి రాత, బాపూ చేతతో రూపుదిద్దుకున్న 'పెళ్లి పుస్తకం' నవజంటలకే కాదు, సిల్వర్ జూబ్లీ సెలెబ్రేషన్ చేసుకున్న దంపతులకూ పవిత్ర గ్రంథం.

### ముచ్చటైన మిథునం

అచ్చట్లు, ముచ్చట్లు కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులకే కాదు ముదిమి జంటకూ ఉంటాయని నిరూపించిన చిత్రం 'మిథునం'. అప్పదాసుకు తిండి యావ. పైగా విపరీతమైన కోపం. బుచ్చిలక్ష్మి మహా తెలివైంది. భర్త పైత్యానికి విరుగుడు తెలిసిన ఇల్లాలు. ఆయన కోపాన్ని చల్లార్చే ప్రేమ గుళికలు ఆమె దగ్గర ఎన్నో ఉన్నాయి. ఆయన గారు శ్రుతిమించిన వేళ 'ద్రాక్షారం సంబంధం కుదిరితేనా..' అనేసి ఉడికించడమూ ఆమెకు రివాజు. 'అమ్మి తిట్లకు ఓర్చుకుంటావు కానీ, పొగడ్తలకు పొంగిపోవు కదా' అని అంతటి తిక్క అప్పదాసు కితాబిచ్చాడంటే.. ఆయన్ను ఈవిడ ఎంతగా కొంగున కట్టుకుందో తెలిసిపోతుంది. శ్రీరమణ రచించిన 'మిథునం' కథ ఆధారంగా తనికెళ్ల భరణి దర్శకత్వంలో వచ్చిన 'మిథునం' ఆదిదంపతులు అభిమానించే ముచ్చటైన చిత్రం అనిపించుకుంది. కేవలం రెండే పాత్రలతో సినిమా నడిపించిన తీరు అపురూపమే! అప్పదాసుగా ఎస్వీ బాలు, బుచ్చిలక్ష్మిగా లక్ష్మి నటన ప్రతి సన్నివేశంలోనూ శిఖరాయమానంగా అలరిస్తుంది. సినిమాగా చూస్తే 'మిథునం' వినోదాన్ని పంచుతుంది. చివరికి విషాదాన్నీ రుచి చూపిస్తుంది. లోతుగా చూస్తే, జంట పాత్రల మాటలను మనసుతో వింటే.. సంసారం సాగరం అనిపించదు. బృందావనిలోని యమునలా అలరిస్తుంది. ప్రతీ రాత్రి వసంత రాత్రిగా మలుచుకోవడం ఇంత తేలికా అనిపిస్తుంది.

> **ఆ రోజుల్లో...**
>
> టాకీ చిత్రాలు మొదలైన నాటి నుంచి పెళ్లి సినిమాలు తరచూ ప్రేక్షకులను పలకరించాయి. విజయవంతం అయ్యాయి. అయితే, అప్పట్లో చాలా కథలు 'పెళ్లి'తో సుఖాంతం అయ్యేవి. 'పెళ్లి'తో మొదలైన సినిమాలు అరుదనే చెప్పాలి. అక్కినేని, జమున జంటగా నటించిన 'పెళ్లినాటి ప్రమాణాలు' సూపర్ హిట్ చిత్రం. ఇందులో జీవితంలో ఎలా ఉండాలో భార్యాభర్తలు ఇద్దరూ పెళ్లినాడు ప్రమాణాలు చేసుకుంటారు. చాలా కాలం ఆ ప్రమాణాలు పాటిస్తూ ఆదర్శంగా కాలం గడుపుతారు. కానీ, ముగ్గురు పిల్లలు కలిగాక.. భార్య తనను అంతగా పట్టించుకోవడం లేదని పక్కచూపులు చూస్తాడు భర్త. చివరికి భార్యను మించిన బంధువు లేదని హీరో తెలుసుకోవడంతో సినిమా ముగుస్తుంది. ఈ సినిమా కూడా వివాహ బంధం ఎంత గొప్పదో చాటి చెబుతుంది. భార్యకు సుఖం పంచలేని ఓ భర్త కథ 'సుమంగళి'. అక్కినేని, సావిత్రి నటించిన ఈ సినిమా అప్పట్లో ఓ సంచలనమే! హీరోహీరోయిన్లు ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. ఓ ప్రమాదం కారణంగా హీరో సంసారానికి పనికిరాకుండా అవుతాడు. వయసులో ఉన్న భార్య ముచ్చట తీర్చలేక పోతున్నానే అని ఆవేదనలో కూరుకుపోతాడు. ఆమెకు మళ్లీ పెళ్లి చేసి తన ప్రేమను చాటుకోవాలని భావిస్తాడు. భర్త ఉద్దేశాన్ని గ్రహించిన ఆమె.. ఆత్మహత్యకు పూనుకుంటుంది. సరిగ్గా యాభై ఏండ్ల కిందట వచ్చిన ఈ సినిమా అప్పటి సామాజిక పరిస్థితుల్లో అలా విషాదాంతమైంది. కానీ, ఆ హీరో త్యాగం మాత్రం ఆనాటికీ, ఈనాటికీ ఆదర్శమే!

### ఒప్పందం కాదు..

పెళ్లి కథలు తెరమరుగవుతున్న వేళ వివాహ బంధం విలువను చాటి చెప్పిన సినిమా 'శ్రీనివాస కళ్యాణం'. స్నేహితుల బలవంతం మీద 'చోలీ కే పీఛే క్యా హై' పాటకు వరుడు డ్యాన్స్ చేశాడని ఇటీవల ఓ ఆడపిల్ల తండ్రి పీటల మీద పెళ్లి నిలిపేశాడు. కూతురు బతిమాలినా.. 'ఈ అబ్బాయి మనకు సెట్ కాడు' అని పెళ్లి క్యాన్సిల్ చేశాడు. అసలు పెళ్లంటే.. ఇచ్చిపుచ్చుకునే కట్నాలు కాదు. వేద మంత్రాల సాక్షిగా జరిగే పుణ్యక్రతువు. ఈ పవిత్ర కార్యాన్ని ఒప్పందంగా మార్చాలని భావిస్తాడు హీరోయిన్ తండ్రి. అతనికి పెళ్లి గొప్పదనాన్ని చాటి చెప్పాలనుకుంటాడు హీరో! అందుకే పెళ్లిలో జరిగే ప్రతి అంకాన్నీ సలక్షణంగా చిత్రీకరించి కలర్‌ఫుల్ ఫెస్టివల్‌గా 'శ్రీనివాస కళ్యాణం' సినిమాను తీర్చిదిద్దాడు దర్శకుడు వేగేశ్న సతీష్. కొట్నం నుంచి అప్పగింతల వరకు పెళ్లిలో జరిగే ప్రతి సందర్భాన్నీ హృద్యంగా తెరకెక్కించాడు. నితిన్, రాశీ ఖన్నా జంటగా వచ్చిన ఈ సినిమా 2018లో విడుదలై మంచి కలెక్షన్లే రాబట్టింది. పెళ్లి గొప్పదనం చాటినందుకు అందరి మన్ననలూ అందుకుంది.

### పవిత్ర బంధం

ఒప్పందం పెళ్లి కథావస్తువుగా తెరకెక్కిన మరో సినిమా 'పవిత్ర బంధం'. సౌందర్య, వెంకటేశ్ నాయికానాయకులుగా నటించిన ఈ చిత్రం సెన్సేషనల్ హిట్ సాధించింది. ఆధునిక పోకడతో ఆలిని ఉద్యోగిగా భావించిన భర్త, స్వాభిమానం కలిగిన ఓ భార్య కథ ఇది. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను కట్టిపారేయడంలో సిద్ధహస్తుడైన ముత్యాల సుబ్బయ్య దర్శకుడు. ఇంకేముంది సబ్జెక్టుకు తగ్గట్టుగా సన్నివేశాలు బలంగా పండాయి. పెళ్లంటే అగ్రిమెంట్ అనుకున్న హీరోకు కనువిప్పు కలగడం, ఆమె బెట్టు చేయడం, ఇద్దరి మధ్యా సయోధ్య కుదరడం చకచకా జరిగిపోతాయి. సినిమా చూసిన ప్రేక్షకులకు బాగానే గిట్టుబాటు అయింది. అంతర్లీనంగా భార్యాభర్తల అనురాగం ఎలా ఉండాలో 'పవిత్ర బంధం' చెబుతుంది. ఆ సినిమాలో ఓ పాటలో 'ఏ స్వార్థమూ లేని త్యాగం భార్యగా రూపమే పొందగా' అన్న మాటలోని సత్యాన్ని గ్రహిస్తే.. 'పవిత్ర బంధం' శాశ్వత అనుబంధంగా మిగిలిపోతుంది.

### విడాకులకు ఆహ్వానం

వేదమంత్రాలు, మంగళ వాద్యాలు, బంధువుల ఆశీర్వాదాల మధ్య జరిగే ఉత్సవం కల్యాణం. కానీ, విడాకులు మాత్రం కోర్టు నాలుగు గోడల మధ్య సంతకాలతో అయిపోతాయి. ఎందరి మధ్య తనకు తాళి కట్టాడో, అందరి మధ్యా తెగదెంపులు చేసుకోవాలని న్యాయవ్యవస్థకే సవాలు విసిరిన చిత్రం 'ఆహ్వానం'. ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో శ్రీకాంత్, రమ్యకృష్ణ హీరో హీరోయిన్లు. నలుగురిలో విడాకులు ఇవ్వడానికి సిద్ధపడ్డ భర్తకు సినిమా పతాక సన్నివేశంలో మాంగల్యం పవిత్రతను చాటి చెబుతుంది భార్య. వివాహ బంధం ఎంత గొప్పదో వివరిస్తుంది. తన తప్పు తెలుసుకొని భర్త మారడం సినిమాలో సహజం. అతణ్ని ఆమె అంగీకరించడం అంతే సులభం కావొచ్చు. కానీ, చిన్నాచితకా కారణాలకే కోర్టు మెట్లు ఎక్కుతున్న నేటి జంటలకు 'ఆహ్వానం' కనువిప్పే!



## మరక మంచిదే!

**'మరక** మంచిదే!' అంటూ అదాశర్మ పెట్టిన పోస్ట్.. నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా, ఓ షూట్‌కు సంబంధించిన ఫొటోలను అదాశర్మ ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసింది. ఆ ఫొటోల వెనక కథను చెబుతూ.. 'నీళ్లు తాగడం చాలా ముఖ్యం. ఎందుకంటే.. మిమ్మల్ని మీరు హైడ్రేట్ చేసుకోవాలి. కానీ, త్వరత్వరగా తాగితే.. ఇలాగే మీద పడిపోతాయి. అప్పుడే సూర్యాస్తమయంలో ఫొటోలు తీసుకోవాలి అనుకుంటే.. ఆ దుస్తులను ఆరబెట్టుకునే సమయం కూడా ఉండదు. అందుకే.. నీళ్లు పడిన మరక కనిపిస్తున్నా.. ఫొటోలు మాత్రం తీసేసుకున్నా. ఎందుకంటే, నాకు సూర్యాస్తమయమే ముఖ్యం' అంటూ రాసుకొచ్చింది. అయితే, ఫొటోషాప్‌లాంటి సాఫ్ట్‌వేర్లు ఉపయోగించి ఆ మరకలను తొలగించుకోవచ్చనీ, కానీ, అలా ఉండటమే మంచిదని అనిపించినట్టు కూడా చెప్పుకొచ్చింది. 'ఈ ఫొటోలను చూసినప్పుడల్లా.. కేర్‌లెస్‌గా ఉండకూడదని నాకు గుర్తుకొస్తూ ఉంటుంది' అని వెల్లడించింది. అదాశర్మ పెట్టిన ఈ పోస్ట్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇక బాలీవుడ్ నటి అదాశర్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో నితిన్‌కు జోడీగా.. 'హార్ట్ ఎటాక్'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తర్వాత బాలీవుడ్ బాటపట్టి.. బాగానే ఆఫర్లు కొట్టేసింది. వరుస సినిమాలతో మంచి పాపులారిటీని దక్కించుకుంది. 'ద కేరళ స్టోరీ' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది. ఆ తర్వాత బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం అన్ని భాషల్లోనూ నటిస్తూ.. బిజీగా మారిపోయింది. ఇక సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే అదాశర్మ.. తన సినిమాలతోపాటు వ్యక్తిగత విషయాలనూ ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది.

## ఇది అందరి కథ

**సాన్య మల్హోత్ర..** బీటౌన్‌లో పరిచయం అక్కర్లేని పేరు. 'దంగల్'తో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ.. తొలి సినిమాతోనే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది. కెరీర్ ప్రారంభంలోనే కాంట్రవర్షియల్ కామెంట్స్ చేసి.. అందరి దృష్టిలో పడింది. 'బోల్డ్ కామెంట్స్'తో ఇంటర్నెట్‌లోనూ తెగ వైరల్ అయ్యింది. సాన్య నటించిన తాజా చిత్రం 'మిసెస్' ఇటీవలే ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్‌కు వచ్చింది. దేశంలో చాలామంది మహిళలు ఎదుర్కొనే సవాళ్లే ఇతివృత్తంగా వచ్చిన ఈ సినిమా.. హిట్ టాక్‌తో దూసుకెళ్తున్నది. ఈ సందర్భంగా సాన్య ఓ ఆన్‌లైన్ మీడియాతో మాట్లాడుతూ.. మహిళల సమస్యలు, చిత్ర సీమకు సంబంధించిన విషయాలను పంచుకున్నది. 'కొత్తగా పెళ్లయిన అమ్మాయి.. అత్తారింట్లో భర్త, కుటుంబసభ్యుల ప్రవర్తనతో ఎలాంటి ఇబ్బందులు పడుతుంది? శారీరకంగా, మానసికంగా ఎదుర్కొన్న సవాళ్లేంటి? అనేవే ఇందులో చూపించాం. నేను 'మిసెస్' స్క్రిప్ట్ చదివినప్పుడు.. అందులో నన్ను నేనే చూసుకున్నా' అంటూ చెప్పుకొచ్చింది. మిసెస్ చిత్రంలో తాను పోషించిన పాత్ర 'రిచా'లాంటి సవాళ్లను తానెన్నడూ ఎదుర్కోలేదనీ, కానీ తన తల్లి, సోదరితోపాటు తనచుట్టూ ఉండే ఎంతో మందిని చూశాననీ వెల్లడించింది. ఇప్పుడు మిసెస్ చిత్రంలో 'రిచా'ను చూసిన తర్వాత.. సమాజంలో తప్పకుండా మార్పు వస్తుందనీ, మహిళలపై వివక్ష తగ్గుతుందని భావిస్తున్నట్టు ఆశాభావం వ్యక్తం చేసింది. ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రలో వచ్చిన 'ద గ్రేట్ ఇండియన్ కిచెన్' సినిమాకు రీమేక్‌గా వచ్చిందే 'మిసెస్' చిత్రం. దీనికి ఆర్తి కడవ్ దర్శకత్వం వహించగా.. నిశాంత్, సియా మహాజన్ ప్రధాన పాత్రల్లో నటించారు.

## నిధి వేటలో..

**ఓటీటీ హిట్**

**ద సీక్రెట్ ఆఫ్ ద శీలేదార్స్**
**డిస్నీ+ హాట్ స్టార్:** జనవరి 31, 2025
**తారాగణం:** రాజీవ్ ఖండేల్వాల్, సాయి తమ్హన్‌కర్, ఆశిష్ విద్యార్థి, గౌరవ్ అమ్లాని, కన్నణ్ అరుణాచలం, దిలీప్ ప్రభావల్కర్ తదితరులు
**దర్శకుడు:** ఆదిత్య సర్పోత్‌దార్

**నిధుల** వేట, చారిత్రక నేపథ్యం.. భారతీయ చిత్రసీమలో ఎవర్‌గ్రీన్ కాంబినేషన్! ఈ రెండిటి కలయికలో ఏ భాషలో సినిమా వచ్చినా.. హిట్ అవ్వాల్సిందే! బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురవాల్సిందే! గతంలోనూ ఈ జానర్‌లో వచ్చిన ఎన్నో సినిమాలు, వెబ్ సిరీస్‌లకు భారతీయ అభిమానులు పట్టం కట్టారు. అలాంటి నిధుల వేట, చారిత్రక నేపథ్యంలో వచ్చిన వెబ్ సిరీస్.. 'ద సీక్రెట్ ఆఫ్ ద శీలేదార్స్'. డాక్టర్ రవిప్రకాశ్ కొయాడే రాసిన మరాఠీ నవల 'ప్రతీపశ్చంద్ర' ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కింది. 'డిస్నీ ప్లస్ హాట్ స్టార్'లో ఇటీవలే స్ట్రీమింగ్‌కు రాగా.. హిట్ టాక్‌తో దూసుకెళ్తున్నది. 1996లో మొదలై.. ప్రస్తుత కాలంలో నడిచే కథ ఇది. డా॥రవి భట్ (రాజీవ్ ఖండేల్వాల్).. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోతాడు. బాల్యం నుంచే ఛత్రపతి శివాజీ కథలు వింటూ పెరుగుతాడు. దాంతో, అతనికి శివాజీపై ఎంతో గౌరవ భావం ఉంటుంది. ఇలా ఉండగా, ఒకరోజు రవిని.. న్యాయమూర్తి కృష్ణకాంత్ దీక్షిత్ (దిలీప్ ప్రభావల్కర్) కలుస్తాడు. ఆయన ఛత్రపతి శివాజీకి చెందిన రహస్య నిధి కోసం కొన్నేళ్లుగా అన్వేషిస్తుంటాడు. ఈ క్రమంలో శివాజీ మహారాజ్ నిధికి, రవి భట్‌కు ఉన్న సంబంధం గురించి తెలుసుకుంటాడు. దాంతో రవిని కలిసి.. అతనికి ఒక పుస్తకాన్ని అందించి.. శివాజీ మహారాజ్‌కు చెందిన నిధి గురించి చెబుతాడు. మరి.. ఆ నిధి ఎక్కడ ఉంది? దాని జాడను రవి ఎలా కనుక్కుంటాడు? ఆ నిధిని కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తున్నది ఎవరు? దాన్ని భద్రంగా దాచిపెట్టి.. ఇన్నేళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న శీలేదార్లు ఎవరు? వారికీ, రవికి ఉన్న సంబంధం ఏమిటి? ఇలాంటి ఆసక్తికరమైన మలుపులు తెలుసుకోవాలంటే.. సిరీస్ ఆసాంతం చూడాల్సిందే!